



చిత్రం



మృణాల్ ఠాకూర్, నాని

## తన కూతురే పంచ ప్రాణాలుగా..

నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'హాయ్ నాన్న'. శౌర్యువ్ దర్శకుడు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తున్నది. డిసెంబర్ 21న ప్రేక్షకుల ముందుకురానుంది. తండ్రీకూతుళ్ల అనుబంధానికి అందమైన దృశ్యరూపంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. టీజర్‌ను ఈ నెల 15న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా గురువారం కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'ఇటీవల విడుదలైన 'గాజు బొమ్మ' అనే పాటకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలతో ఈ సినిమా ఆకట్టుకుంటుంది. తన కూతురే సర్వస్వంగా బతికే ఓ తండ్రి కథగా ప్రేక్షకుల్ని ఉద్వేగానికి లోను చేస్తుంది' అని చిత్ర బృందం పేర్కొంది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: సానుజాన్ వర్గీస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, దర్శకత్వం: శౌర్యువ్.



## నన్ను నేనే చూసినట్లుంది!

తోటి కథానాయికను మెచ్చుకోవడం, పొగడటం హీరోయిన్లలో అరుదుగా చూస్తుంటాం. కానీ కాజల్ అగర్వాల్ మాత్రం అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో శ్రీలీలని తెగ మెచ్చుకుంది కాజల్. 'శ్రీలీలను చూస్తుంటే కొన్నేళ్ల క్రితం నన్ను నేను చూస్తున్నట్టుంది. పాత్రపై తను దృష్టిపెట్టే విధానం నిజంగా సూపర్. తన కాంబినేషన్లో చేస్తున్నప్పుడు గ్రహించాను. తను క్యారెక్టర్ నుంచి తేలిగ్గా బయటకు రాదు. కాసేపు అదే ట్రాన్స్‌లో ఉండిపోతుంది. అది మంచి నటికి ఉండే లక్షణం. కొన్ని పాత్రల విషయంలో నేనూ అలాగే ఉండిపోయేదాన్ని. పర్‌ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రలు ప్రతిసారీ దొరకవు. అలాంటి పాత్రలు ఎన్ని దొరికితే నటిగా అంత షైన్ కావొచ్చు. శ్రీలీలకు 'భగవంత్‌కేసరి'లో దొరికిన పాత్ర అలాంటిదే. ఇందులో నా పాత్ర కూడా బాగుంటుంది. కాత్యాయని అనే సైకియాట్రిస్ట్‌గా కనిపిస్తా' అని చెప్పుకొచ్చింది కాజల్.



## నయనతార క్రైమ్ థ్రిల్లర్

జయం రవి, నయనతార జంటగా నటించిన తమిళ చిత్రం 'ఇరైవన్' తెలుగులో 'గాడ్' పేరుతో నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఐ.అహ్మద్ దర్శకత్వం వహించారు. సుధన్ సుందరం, టి.జయరాం, సి.హెచ్.సతీష్‌కుమార్ నిర్మించారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'క్రైమ్ థ్రిల్లర్ కథాంశమిది. హత్యా రహస్య శోధన చుట్టూ కథ నడుస్తుంది. అనుక్షణం ఉత్కంఠను పంచుతుంది. నయనతార పాత్ర చిత్రణ పూర్తి వైవిధ్యంగా ఉంటుంది. జయం రవి, నయనతార కాంబినేషన్‌లో వచ్చిన 'తని ఒరువన్' భారీ విజయం సాధించింది. అదే స్థాయిలో ఈ సినిమా కూడా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే నమ్మకం ఉంది' అన్నారు. వినోద్ కిషన్, రాహుల్ బోస్, విజయలక్ష్మి, నరైన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: హరి కె వేదాంతం, సంగీతం: యువన్‌శంకర్‌రాజా.



## కన్నప్పలో శివరాజ్‌కుమార్

మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో పలువురు అగ్ర తారలు భాగమవుతున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్ లాల్ నటించబోతున్నారని ఇదివరకే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ వెలువడింది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్రను పోషించబోతున్నారు. 'ఆయనే సర్వం..ఆయనే విశ్వం..హర హర మహాదేవ' అంటూ చిత్రబృందం సోషల్‌మీడియాలో ప్రకటించింది. 1988లో శివరాజ్‌కుమార్ కథానాయకుడిగా నటించిన కన్నడ చిత్రం 'భక్త కన్నప్ప' భారీ విజయాన్ని దక్కించుకుంది. ఈ నేపథ్యంలో తాజా చిత్రం 'కన్నప్ప'లో శివరాజ్‌కుమార్ నటించబోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం 'కన్నప్ప' షూటింగ్ న్యూజిలాండ్‌లో జరుగుతున్నది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

## పొలిమేరలో ఏం జరిగింది?



సత్యం రాజేష్, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర-2'. డా|| అనిల్ విశ్వనాథ్ దర్శకుడు. శ్రీకృష్ణ క్రియేషన్స్ పతాకంపై గౌరీ కృష్ణ నిర్మిస్తున్నారు. నవంబర్ 3న విడుదలకానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమా తొలిభాగం చక్కటి ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది. అదే స్థాయిలో రెండో భాగం మెప్పిస్తుంది. గ్రామీణ నేపథ్యంలో మర్డర్ మిస్టరీకి చేతబడి అనే అంశాన్ని జోడించి ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రతి సన్నివేశం ఆసక్తిని పంచుతుంది. పాడేరు, కేరళ, ఉత్తరాఖండ్‌లో చిత్రీకరణ జరిపాం' అన్నారు. వినూత్నమైన మిస్టరీ థ్రిల్లర్‌గా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఖుషేందర్ రమేష్ రెడ్డి, సంగీతం: గ్యాని, కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, దర్శకత్వం: డా|| అనిల్ విశ్వనాథ్.



## తెలుగులో 'ఓ మై గాడ్-2' రీమేక్

అక్షయ్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన 'ఓ మైగాడ్-2' చిత్రం దేశ వ్యాప్తంగా అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. పాఠశాల విద్యార్థుల్లో లైంగిక విజ్ఞానం ఆవశ్యకతను తెలియజెప్పే కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలందుకుంది. లైంగిక విజ్ఞానం విషయంలో సమాజంలోని అపోహలు తొలగిపోవాలనే సందేశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రస్తుతం ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతూ ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేయబోతున్నట్లు తెలిసింది. ఇందులో ఓ అగ్ర హీరో నటించబోతున్నారని వార్తలొస్తున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ రీమేక్ హక్కులను దక్కించుకుందని తెలిసింది. 'ఓ మైగాడ్-2' చిత్రం హిందీ బాక్సాఫీస్ వద్ద 150కోట్లకుపైగా వసూళ్లను సాధించింది.


